చీనీ చెట్లకు చుట్టుముట్టిన తెగుళ్లు

- నిలువునా ఎండుతున్న చీనీచెట్లు
- గిట్టుబాటు కానీ ధరలు
- 20 ఏళ్లకే తుడిచిపెట్టుకుపోతున్న చీనీచెట్లు
- చీనీ చెట్లను నరికివేస్తున్న రైతులు

లింగాల : లింగాల మండలం చీనీచెట్లకు పేరుగాంచింది. ఇక్కడ నుంచి వివిధ రాష్ట్రాలకు చీనీ పండ్లు ఎగుమతి అయ్యేవి. అలాంటి చీనీచెట్లకు తెగుళ్లు చుట్టుముట్టాయి. వేరుకుళ్లు తెగుళ్లు, బంకారు వ్యాధి, పేనుబంక, తెల్లనల్లి, ఎండుకొమ్మ, పల్లాకు తెగుళ్ల వల్ల చీనీచెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. అంతేకాక చీనీ కాయలకు నల్లమంగు, గార వ్యాధులు సంభవిస్తున్నాయి. దీంతో కాయల నాణ్యత తగ్గిపోతుంది. చీనీ కాయలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించలేదు. దీనికితోడు సూట్ పేరుతో 10 టన్నులకు రెండున్నర టన్నుల కాయలు వ్యాపారులు ఉచితంగా ఇవ్వాల్సి వస్తోంది. చీనీచెట్లలో కలుపు నివారణ, తెగుళ్ల మందులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రైతులు పండిస్తున్న చీనీ కాయలకు నిర్దిష్ట ధర లేకపోవడంవల్ల రైతులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. అంతేకాక చీనీ పంటలకు అనువైన వాతావరణంలేక దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో చీనీ పంటలపై రైతన్నలు ఆశలు వదులుకుని చీనీచెట్లను కొట్టివేస్తున్నారు. మండల వ్యాప్తంగా లింగాల, కర్ణపాపాయపల్లె, బోనాల, వెలిదండ్ల, అక్కులగారిపల్లె, తేర్నాంపల్లె, అంకేవానిపల్లె, కామసముద్రం, లోపట్నూతల తదితర గ్రామాల్లో ఈ ఏడాదే వందలాది ఎకరాలలో రైతులు చీనీ చెట్లను నరికివేశారు. ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చినా వాటిని రైతులు పాటించినా తెగుళ్ల నివారణ కాకపోవడంతో చీనీ పంటలపై రైతులు ఆశలు వదిలేసుకుంటున్నారు.


రైతు వెంగల్‌రెడ్డి తోటలో నరికి వేసిన చీనీ చెట్లు


క్రష్సింగ్ మిషన్‌తో తొలగిస్తున్న చీనీచెట్లు

పెట్టుబడులు కూడా అందడంలేదు..



చీనీ పంట సాగు చేసి 16 ఏళ్లవుతోంది. తెగుళ్లు చుట్టుముట్టి చెట్లు ఎండిపోతున్నాయి. కాపు రావడంలేదు. గిట్టుబాటు ధర లభించలేదు. పురుగు మందులు, తెగుళ్ల మందులు, కలుపు నివారణ ఖర్చులు కూడా పంటలలో అందడంలేదు. దీంతో 14 ఎకరాలలోని 1500ల చీనీచెట్లను నరికివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– పోచంరెడ్డి వెంగల్‌రెడ్డి, చీనీ రైతు, లోపట్నూతల

చీనీ సాగు భారమవుతోంది..



చీనీ పంట సాగు రైతులకు భారంగా మారింది. సాగు చేసిన 5 ఏళ్ల తర్వాత కానీ ఫలసాయం అందదు. ప్రస్తుత పరిస్థితులలో ఎరువులు, పురుగు మందులు, కూలీల వేతనాలు పెరిగిపోతున్నాయి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు కరువయ్యాయి. తెగుళ్లతో చెట్లు ఎండిపోతున్నాయి. తెగుళ్లను నివారించుకోలేక గిట్టుబాటు ధర లభించక చీనీ చెట్లపై ఆశలు వదులుకుని 5 ఎకరాలలో 600ల చీనీ చెట్లను నరికివేశాను.

– తేరా ప్రభాకర్‌రెడ్డి,చీనీ రైతు, లింగాల

వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు

ప్రస్తుతం చీనీ పంటలకు వాతావరణం అనుకూలించలేదు. గాలిలో తేమ, భూమిలో పరిగిన తేమ శాతం కారణంగా చీనీచెట్లకు కాపు రావడంలేదు. శాస్త్రవేత్తల సూచనల మేరకు యాజమాన్య పద్ధతులను పాటిస్తే తెగుళ్లను నివారించుకోవచ్చు. ప్రస్తుతం అరటి పంటలో గిట్టుబాటు ధరలు లభిస్తున్నందున చీనీ రైతులు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు.

– రాఘవేంద్రారెడ్డి,హెచ్‌ఓ, పులివెందుల

జాబ్ మేళాలో 25 మంది ఉద్యోగాలకు ఎంపిక

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాలో 25మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్లేస్ మెంట్ అధికారి పృధ్వీరాజ్ తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 34 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 24మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సిసి రామలింగయ్య, వెలుగు సిబ్బంది చంద్రబాబు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అటవీ యేతర ప్రాంతంలో చెట్ల పెంపకం

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం రామనపల్లి గ్రామంలో అటవీ యేతర ప్రాంతంలో చెట్ల పెంపక కార్యక్రమం అవగాహన, శిక్షణ సదస్సును రైతులకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ట్రీస్ ఔట్సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టిఓఎఫ్ఐ) ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ కె.సతీష్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, శిక్షణ సదస్సులో ఉద్యానవన మొక్కలు అలాగే అడవి జాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే దానివల్ల వచ్చే ఉపయోగాలను, అదనపు ఆదాయం గురించి రైతులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశు, హార్టికల్చర్ అధికారి రెడ్డయ్య, అగ్రికల్చర్ అధికారి నావంత్‌బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేముల : వేల్పుల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని యూసీఐఎల్ ఫీడర్, బెస్తవారిపల్లె ఫీడర్, భ్రమరాంబ ఫీడర్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలన్నారు.

వైభవంగా దీపోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఇందుకూరు, కొత్తపల్లె గ్రామాల్లో శనివారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దీపోత్సవం వైభవంగా సాగింది. ఉరుటూరు మామహేశ్వర శర్మ శిష్య బృందంచే నిర్వహించిన లక్షార్చన కార్యక్రమంలో మాల ధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బగ్గీపై అయ్యప్పస్వామి ఉత్సవమూర్తిని ఉంచి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేరళ వాయిద్యం, చెక్కభజన, కోలాట కార్యక్రమాలు భక్తులను ఎంతగానోఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శాంతియుతంగా మెలగాలి


మాట్లాడుతున్న సీఐ లింగప్ప

జమ్మలమడుగు రూరల్ : ప్రజలు శాంతియుతంగా మెలగాలని పట్టణ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో అన్ని మతాల పెద్దలతో కలసి పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో కుల, మతాలకు అతీతంగా అన్నీ పండగలను ప్రజలు శాంతియుత వాతవరణలో నిర్వహించుకోవాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు బి.రామకృష్ణ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

రైల్వేఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

ఎర్రగుంట్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్ వలన ముద్దనూరు రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు ఇరువైపుల ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉన్నాయని ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రొద్దుటూరు రోడ్డు వరకు నిర్మించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్ శనివారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

దోమల నివారణకు ఫాగింగ్


దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్న సిబ్బంది

పులివెందుల టౌన్ : పట్టణంలోని పెద్దకొండప్ప కాలనీలో శనివారం దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశాల మేరకు శానిటరీ సెక్రటరీలు, పారిశుద్ధ్య సిబ్బంది వాహనాల ద్వారా పొగ మందు వదులుతూ వెళ్లారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

వైవీయూ: దైనందిక జీవితంలో మొక్కల పెంపకం.. ఓ భాగం కావాలని, వాటితోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్–2 , 8 ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్ పీ.వెంకటరమణ, డాక్టర్ సుమిత్ర ఆధ్వర్యంలో వాలంటీర్లు 300 మొక్కలను నాటారు. ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డా.సరిత, డా.అనుప్రసన్న, వలంటీర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: వైఎస్ఆర్ కడప జిల్లా పరిధిలోని 1962 మొబైల్ వెటర్నరీ అంబు లెన్స్‌లో పైలెట్లు(డ్రైవర్లు)గా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 1962 పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ కోరారు. 36 సంవత్సరాలలోపు వయోపరిమి తి కలిగి ఉండి 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీడ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. వివరాలకు 9154970180 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చారిత్రక కట్టడాలపై అవగాహన

వైవీయూ: జిల్లాలోని అపురూప శిల్ప సంపద.. జిల్లా ఔన్నత్యాన్ని చాటి చెబుతుందని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో ఇంటాక్ ఆధ్వర్యంలో చారిత్రక కట్టడాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ మాట్లాడుతూ జిల్లాకు ఎంతో ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. లలితకళల విభాగం విద్యార్థులు శిల్పకళా సంపదపై అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఇంటాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతులులేని గుడారాలపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : ప్రపంచ పర్యాటక ప్రాంతమైన గండికోటలో అనుమతులు లేని టెంట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పర్యాటక కేంద్రమైన గండికోటలో పర్యాటక శాఖ ఎటువంటి భద్రతలు పర్యాటకులకు కల్పించడంలేదన్నారు. గండికోట అందాలను చూడటం కోసం ఎందరో పర్యాటకులు ప్రతి వారం వస్తున్నారు. వారి వద్దనుంచి టోల్‌గేట్‌ల పేరుతో వసూళ్లు చేస్తున్నారని, గండికోటలో కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. పోలీసులు గండికోటకు వచ్చె పర్యాటకులకు భద్రత కల్పించాలన్నారు.


డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

పులివెందుల రూరల్ : వాసవీ కాలనీలో నెలకొన్న మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార మాజీ ప్రతినిధి వేలూరు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వాసవి కాలనీని వారు సందర్శించి కాలనీలో ప్రవహిస్తున్న మురుగు నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ అస్తవ్యస్తంగా ఉండటంవల్ల మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోందన్నారు. కొందరి ఇళ్లల్లోకి కూడా మురుగు నీరు వెళ్లడంతో వారు అవస్థలు పడుతున్నారని, ఇంత అస్తవ్యస్తంగా ఉంటే అధికారులు ఏమి చేస్తున్నారని వారు ప్రశ్నించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. లేనిపక్షంలో సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

పులివెందుల రూరల్ : మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. మత్తు పదార్థాలు అంటే ఏమిటి, వాటి వలన కలిగే దుష్ఫలితాలు, తద్వారా బాధిత కుటుంబం, సమాజం పడే ఇబ్బందులు, విద్యార్థుల జీవితంపై, ఆరోగ్యంపై వాటి ప్రభావం తదితర అంశాలపై వివరించారు. ప్రతి విద్యార్థి తన జీవిత అభివృద్ధికి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తపడి బంగారు భవిష్యత్తును సుగమం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ నరసింహులు, రూరల్ సీఐ ఎస్.వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శేషమహేశ్వరమ్మ, హాస్టల్ మేనేజర్ డాక్టర్ జి.మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్

మామిడి తోటలకు బీమా పథకం

చింతకొమ్మదిన్నె : అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా పంటల బీమా పథకాన్ని చెల్లించనున్నారు. మామిడి పంటకు రబీ 2024–2025 వర్తింపచేస్తున్నారు. ఐదు సంవత్సరాలు పైబడిన ఎకరం మామిడి చెట్ల పంటకు నష్టపోయినచో రూ.42,000 బీమా సంస్థ చెల్లించనుంది.

ఇందుకుగాను రైతు వాటాగా ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.2,100. 15–12–2024 లోగా రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, పంట నమోదు పత్రంతో కామన్ సర్వీస్ సెంటర్ నందు లేదా రైతులే స్వయంగా పీఎంఎఫ్‌బీఐ పోర్టల్‌లో మొబైల్ ద్వారా నమోదు చేసుకోవడం వలన ఇన్సూరెన్స్ సౌకర్యం పొందవచ్చు. 15–12–2024 నుండి 31–05–2025 వరకు అధిక వర్షపాతం, గాలిలో తేమ వ్యత్యాసం, వాతావరణం వ్యత్యాసం , అధిక గాలివేగం సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో గల ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరికరాల ద్వారా లెక్కిస్తారన్నారు. దాని ఆధారంగా ఇన్సూరెన్స్ నష్టపరిహారం చెల్లించనున్నారు. రైతులకు పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుండి పంట బీమా సౌకర్యం పొందడానికి గ్రామ సచివాలయ కేంద్రంలో కచ్చితంగా పంట నమోదు చేసుకుని బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


అయ్యప్ప స్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న బాలికలు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పాతబస్టాండ్, మార్కెట్‌బజార్, మెయిన్‌బజార్, పలగాడిసెంటర్, తేరు రోడ్డు, పెద్దపసుపల రోడ్డు, సంజామలమోటు మీదుగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. చెక్క భజనలతో కోలాటం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట బాలికలు దీపాలతో తమ భక్తిని చాటుకున్నారు. పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.

ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలి

జమ్మలమడుగు : నిరుపేదలకు రెండు ఎకరాల సాగుభూమి ఇస్తామంటూ ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి, టీడీపీ నాయకుడు నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి, దళిత డప్పు కళాకారుల సంఘం నాయకులు తెలిపారు. రెండు ఎకరాల భూమిపై పోరాటం చేద్దామంటూ శనివారం చిట్టిమిటిచింతల గ్రామంలో వారు ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజన, దళిత డప్పు కళాకారులకు ఇస్తామన్న రెండు ఎకరాల భూమిపై ఇంత వరకు ఒక ప్రకటన కూడా చేయలేదన్నారు. ఈనెల 9వ తేదిన ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దళిత హక్కుల పోరాట సమితి, దళిత డప్పు కళాకారుల సంఘం నాయకులు మునెయ్య, శంకర్‌నాయక్, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించాలని వినతి

లింగాల : స్థానిక ఎస్సీ కాలనీలో ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి కాలనీ వాసులు వినతిపత్రం అందించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న ఎంపీడీఓను వారు కలిసి మాట్లాడారు. కాలనీలో కంపచెట్లు ఏపుగా పెరిగి విష పురుగులు, క్రూర జంతువులు సంచరిస్తున్నాయని.. దీంతో భయాందోళన చెందుతున్నామన్నారు. రెండు రోజుల క్రితం అదే కంపచెట్లలో పులి సంచరించినట్లు గుర్తించామని, ఫారెస్టు అధికారులు కూడా వచ్చి సమస్యను తెలుసుకోవడం జరిగిందన్నారు. మా సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.


ఎంపీడీఓకు వినతిపత్రం అందించిన ఎస్సీ కాలనీ వాసులు

కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్సార్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ పీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, గంగాంజనేయులు కోరారు. కడప నగరానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ఖాళీలకు సంబంధించి ఆర్టీసీలో దీర్ఘకాలికంగా పని చేస్తున్న 7880 మంది ఔట్ సోర్సింగ్ కార్మికుల సర్వీసులను పరిగణలోకి తీసుకుని రెగ్యులర్ ఉద్యోగులుగా అవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఆర్టీసీ నోటిఫికేషన్ ప్రకారం సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న తమకు రెగ్యులర్ ఉద్యోగాల భర్తీలో వెయిటేజీ ఇవ్వాలన్నారు. ప్రస్తుత యాజమాన్యం చెల్లిస్తున్న వేతనాలు పూర్తి స్థాయిలో కాంట్రాక్టర్ల ద్వారా అందడంలేదని, థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దుచేసి క్యాజువల్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ విషయంగా ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు వేచియున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

పట్టుదలతో ఉన్నత చదువులు చదవాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలు తల్లిదండ్రుల మాటలు వింటూ పట్టుదలతో, క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి మంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చదువును అశ్రద్ధ చేయకుండా తోటి విద్యార్థులతో పోటీపడి చదవాలన్నారు.

పులివెందుల రూరల్ : విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులు, గురువులపైనే ఆధారపడి ఉంటుందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఇన్‌చార్జి ఆర్డీఓ అనురాధలు తెలిపారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బెస్తవారిపల్లె, నల్లపురెడ్డిపల్లె, గురుకుల పాఠశాలల్లో సమావేశాలను నిర్వహించారు. కార్యక్రమంలో యూసీఐఎల్ ఎండీ, డీజీఎం సుమన్, ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పులివెందులలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలల్లో గడుపుతుంటారు కాబట్టి వారి ప్రవర్తనపై పిల్లల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం మత్తులకు బానిసలుగా మారి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవడంతోపాటు తల్లిదండ్రుల ఆశలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఎంఈఓ చంద్రశేఖర్‌రావు, అర్బన్‌సీఐ లింగప్ప విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఎస్.మధుసూదనరెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గురువుల సూచనలు పాటించి నడుచుకుంటే బంగారు భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్వరి, వార్డెన్ ఫరూక్, హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వేములలో..

వేముల : స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో జరిగిన సమావేశంలో యురేనియం ప్రాజెక్టు జీఎం సుమన్ సర్కార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరారాణి, సర్పంచ్ రామం జనమ్మ, ప్రిన్సిపాల్ శారదమ్మ, యురేనియం అధికారులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : కోవరంగుంటపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాఠశాల ఉపాధ్యాడు అంగడి నాగేంద్ర తల్లిదండ్రులతో చర్చించారు. ఈ మీటింగ్‌కు రిటైర్డు హెడ్మాస్టర్లు రాజేశ్వరరెడ్డి, సూర్యనారాయణ, పీహెచ్‌సీ డాక్టర్ ప్రత్యూషలు హాజరై విద్యార్థులు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను తల్లిదండ్రులతో కలిసి తిలకించి ప్రశంసించారు.

వల్లూరులో..

వల్లూరు : పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంపీడీవో రఘురాం అన్నారు. వల్లూరులో శనివారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రిన్సిపాల్ నసీమున్నీసా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.


జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో మంచి విద్యను బోధిస్తున్నారా, మెనూ ప్రకారం నాణ్యమైన బోజనం పెడుతున్నారా లేదా అన్నదానిపై తల్లితండ్రులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున, మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్, మండల అభివృద్ధి అధికారి చంద్రమౌలి మరియు ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించినట్లు ఎంఈఓ సుజాత తెలిపారు. ఆత్మీయ సమావేశాలు పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. పిల్లల బంగారు భవిష్యత్ కొసం తల్లిదండ్రుల సహకారం తప్పని సరిగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహించిన టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సీఐ దస్తగిరి మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకు, గంజాయి వంటి మత్తు పదార్థాల దూరంగా వుండాలని వీటికి బానిసలైతే భవిష్యత్ వుండదని తెలిపారు.


వీఎన్‌పల్లె : మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురంలో

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే ఉత్సాహభరితంగా నిర్వహించారు. రాష్ట ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో, ఎస్ఎంసీ చైర్మన్లు, పాఠశాలల స్పెషలాఫీసర్ల పర్యవేక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

చెన్నూరులో..

వల్లూరు(చెన్నూరు) : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఎంఈఓ–2 సరస్వతి పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థులకు కేవలం విద్యనే కాకుండా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. అకార్యక్రమంలో తాహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు రత్నాదేవి పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొలుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈఓ 2 రమాదేవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ విద్య అభ్యసించడంతోపాటు నైతిక విలువలు కలిగి ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగాలని ఆకాంక్షించారు. తల్లితండ్రులు పాఠశాలలోని రెండు తరగతుల విద్యార్థులకు స్థల సౌకర్యం లేక పాఠశాల బయట తరగతి గదులు నిర్వహిస్తున్నందున ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించి పాఠశాలకు స్థల సౌకర్యం, తరగతి గదులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, స్పెషల్ ఆఫీసర్ చాంద్‌బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : చదువే ప్రతి విద్యార్థికి పెద్ద అస్తి అని కాబట్టి చదువుపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు చూసి విద్యార్థులు చెడు అలవాట్లకు లోను అవుతున్నారని తల్లిదండ్రులు పిల్లలను సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని కోరారు. ఎంఈఓ స్టాలిన్, ఎంపీడీఓ కుళాయమ్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని మండల స్పెషలాఫీసర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ రమాదేవి, ఎంఈఓ రామకృష్ణయ్య, విద్యార్థుల పాల్గొన్నారు.